# ఉత్తరం

## తమిరిశ జానకి

ఎవరో పిల్చినట్టయి వంటింట్లోంచి ఇవతలికి వచ్చింది సునీత. ముందు వరండా కిటికీలోంచి ఓ కార్డు లోపల పడేసి రయ్యిన సైకిల్ మీద వెళ్లిపోయాడు పోస్ట్‌మ్యాన్.

ఈ ఊరొచ్చి... ఈ ఇంటికొచ్చి రెండు రోజులే అయింది. అప్పుడే ఎవ్రరాశారుత్తరం? అనుకుంటూనే వెళ్లి కార్డు చేతిలోకి తీసుకుంది.

ఇదేవిటి? ఎవరో రాజారావనే ఆయనకి వొచ్చిందీ ఉత్తరం. ఇక్కడ పడేశాడేవిటి... ఇంటి నెంబరిదే ఉంది కార్డుమీద... అందుకే ఈ ఇంట్లో పడేశాడు... అతని తప్పేంలేదు. వాళ్లెవరో అడ్రసులో ఇంటి నెంబరు తప్పు వేశారన్న మాట... ఎవరో ఈ రాజారావు మరి? ఇరుగు పొరుగు ఇళ్లల్లో ఎవరో అయి ఉంటారు. పక్కింటి వాళ్లకేమన్నా తెలుసేమో... అడగాలి. ఔనులేకపోతే... ఈ ఉత్తరం ఎవరిదో వాళ్లకి చేరకపోతే ఎలా? సరిగ్గా అప్పుడే పక్కింటావిడ బయటికొచ్చింది. ఆవిడతో నిన్న పరిచయం అయి ఉండటంవల్ల.. పలకరింపుగా నవ్వింది సునీత.

"రాజారావు పేరు గల వాళ్లెవరున్నారండీ ఇక్కడ?"

రాజారావా?... ఇప్పుడు మీరున్న ఇంట్లోనే పెరట్లో విడిగా ఓ గది ఉంది చూడండి దాంట్లో అద్దెకి ఉండేవాడతను. ఈ ఊర్నించి వెళ్లిపోయి అప్పుడే నెల్లాళ్లయి పోయింది. ఏం? ఎందుకడుగుతున్నారూ?" ఎదురు ప్రశ్న వేసింది పక్కింటావిడ.

"ఇదుగో ఈ కార్డు వొచ్చిందండీ ఆయన పేరున."

"అలాగా"

"పోనీ... మీకాయన అడ్రసు తెల్సాండీ? డైరెక్టు చేస్తాం"

"మాకే కాదమ్మా.. ఎవ్వరికీ తెలియదు. ఆఫీసులో పై అధికారితో ఏదో విషయంలో తగువు పెట్టుకుని ఉద్యోగం రిజైను చేసేసి వేరే ఊరెళ్లిపోయాడు. ఏ ఊరెళ్తున్నది ఏ ఉద్యోగంలో చేరుతున్నదీ ఆఫీసులో కూడా ఎవరికీ చెప్పలేదుట. అసలింటి దగ్గిర కూడా చుట్టుపక్కల ఎవరితోనూ అట్టే మాట్లాడే వాడు కాదు. తన గురించి విషయాలేవీ ఎప్పుడూ ఎవరితోనూ చెప్పలేదు. వాళ్ల స్వంత ఊరేదో కూడా మాకెవరికీ తెలీదు"

ఏం చెయ్యాలో తెలీలేదు సునీతకి.

భర్త ఇంటికి వచ్చాక ఈ విషయం చెప్పాలనుకుంది. కార్డు లోపల గదిలో బల్లమీద పెట్టి వంటిట్లోకి నడిచింది.

* * *

"ఏవండీ..."

"ఊఁ..."

"కనుకున్నారా?"

"ఏవిటి?"

"అదేనండి... ఆ రాజారావు అడ్రసు ఎవరికైనా తెలుసేమో కనుక్కుంటానన్నారుగా ఆ కార్డు రీడైరెక్ట్ చెయ్యడానికి"

"అబ్బ.. అదా.. ఇంకేవిటో అనుకున్నాను... ముందు కాస్త కాఫీ అయినా ఇవ్వకుండా... ఆ రాజారావెవరో గానీ అతని నామస్మరణ ఎక్కువైపోయింది కదా నీకు... కనుక్కున్నాను. ఎవ్వరికీ తెలియదుట. అతనెవ్వరికీ అడ్రసు ఇవ్వలేదుట. ఇంక మనం ఏం చెయ్యలేం". తేల్చి చెప్పేశాడు విశ్వనాథం.

"ఏ ఉత్తరమైనా అందవలసిన వాళ్లకి అందకుండా మిస్సయితే వాళ్లకి బాధే కదండీ పాపం... ఏ పుట్టలో ఏ పాముందో అన్నట్టు ఏ ఉత్తరంలో ఏ అర్జంటు విషయాలుంటాయో?"

"ఓ.కే. ఓ.కే... ఒప్పుకున్నాను. కానీ, నువ్వంత వర్రీ అయిపోకు ప్రతి విషయానికీ... నీ ఒంటికి మంచిది కాదు... నువ్వసలే ఒట్టి మనిషివి కాదిప్పుడు. అదిసరే... కాఫీ తాగుతూ కబుర్లు

కంటేమ్మా చేస్తే బావుంటుందేమో..." చివ మాటలు చిన్నగా నసుగుతూ భర్త అంటుంటే నవ్వొచ్చింది సునీతకి.

"ఇదిగో ఇప్పుడే తెస్తాను" నిమిషాల్లో కాఫీ గ్లాసు అందించింది.

"నువ్వంత వర్రీ అయిపోతున్నావు గానీ.. అది కార్డేగా.. ఏదో మామూలు క్షేమసమాచార ఉత్తరమే అయ్యుంటుంది."

"ఏమో!"

"పోనీ.. మనశ్శాంతయినా ఉంటుంది నీకు. కార్డేగా చదువు. అప్పుడు గానీ స్థిమితంగా ఉండలేవు నువ్వు."

"అంతే అంటారా?"

"అంతే మరి".

కార్డు అందుకుంది సునీత.

"అయ్యయ్యో..పాపం.." నిలబడి ఉన్నదల్లా మంచమ్మీద కూలబడింది. చేతిలో ఉన్న ఆ చిన్న కార్డుముక్క ఎంతో బరువుగా తోచింది.

"ఏవిటి.. ఏమైంది?" కంగారు పడిపోయాడు విశ్వనాథం.

"ఆ రాజారావు తల్లి రాయించిన ఉత్తరవండీ ఇది" నీరసంగా జవాబిచ్చింది.

"అయితే ఏమైంది?"

"చదువుతానండి వినండి. ఏంటే అంత తల్లిగా తెలిపెయ్యలేరు". చదవడం మొదలెట్టింది సునీత.

చిరంజీవి రాజాకి,

నీ తల్లి దీవించి వ్రాయునది, రెండు నెల్లుగా నీ దగ్గర్నుంచి ఉత్తరం లేదు. ఒక్క పైసా కూడా పంపించటం మానేశావు. ఇంట్లో ఉన్న కాస్త సామానూ ఎప్పుడో అమ్మేశాను మందులకోసం. రాను రాను నా ఆరోగ్యం మరింత దిగజారింది. తిండికే లేదు.. మందులెక్కడ కొనుక్కోగలను. పదిరోజులుగా పూర్తిగా మంచం పట్టాను. ఇవాళో రేపో అన్నట్టు ఉన్నాను. చూసే దిక్కులేదు. పక్కింటి వాళ్ల పిల్లాడి చేత ఈ ఉత్తరం రాయిస్తున్నాను. నువ్వు వెంటనే బయల్దేరి రావల్సినది.

ఇట్లు

తులశమ్మ.

"పాపం.. ఏదీ ఆ కార్డిలా ఇవ్వు. ఎప్పుడు రాసిన ఉత్తరమో తేదీ చూద్దాం.."

### ఇదే ఫస్ట్

"డబ్బు సంపాదించటానికి వంద మార్గాలు అనే పుస్తకం రాసింది నేనే"

"అయితే మరెందుకలా అడుక్కు తింటున్నావ్"

"ఆ వంద మార్గాల్లో ఇదే మొదటిది"

- పద్మశ్రీ(మాణిక్యారం)

"చూడండి"

"ఊ... మొన్న రాసిన ఉత్తరమే"

"ఎలాగండీ మరి?"

"కన్నతల్లికి డబ్బూ పంపక, ఉత్తరమూ రాయక ఆమనిముంటే మనం ఏం చెయ్యగలం? ఈ కార్డు మీద ఫ్రమ్ అడ్రసు లేదయ్యే పోనీ.. మీ అబ్బాయి ఇక్కడలేడని ఆవిడకి రాసేందుకు. ఊ. సరే... ఇంక ఆ విషయమే ఆలోచిస్తూ నువ్వు బాధపడొద్దు" భార్య మనసు అతి సున్నితం అని తెలుసు విశ్వనాథానికి. వికలమైన మనసుతో మౌనంగా, కార్డు సొరుగులో పడేసింది సునీత

* * *

"ఏవండీ"

"ఊ"

"పుట్టబోయేది ఆడపిల్లో, మొగపిల్లాడో చెప్పగలిగే పరీక్ష కావాలంటే చేస్తారుట కదండీ, ఆ పరీక్ష నాకు చేయించండి" తెల్లబోయాడు విశ్వనాథం భార్య మాటలకి "ఏవిటి సునీతా నువ్వనేది? మనకిది మొట్టమొదటి బిడ్డ పుట్టబోతోంది. అలాంటి ఆలోచన నీకెందుకొచ్చిందసలు? కొడుకైనా, కూతురైనా ఒకటేనని మొదటినుంచీ మనం అనుకున్నాం కదా? అలాంటప్పుడు...మనకి సమస్యేముంది? ఆడపిల్లయితేనేం, మొగపిల్లాడయితే కావాలి అనుకునే కొందరిలా నువ్వూ మారిపోయావా?"

"మీరు పొరపడుతున్నారు. నాకు ఆడపిల్లే కావాలి. మొగపిల్లాడసలొద్దు."

మరింత ఆశ్చర్యపోయాడు విశ్వనాథం. నచ్చచెప్పే ప్రయత్నంలో అన్నాడు "ఎవరైనా ఒకటే సునీతా. అందులో మొట్టమొదటి బిడ్డకి ఇలా ఎవరూ ఆలోచించరసలు"

"ఉహు... నాకింకేం చెప్పకండి. నాకు మొగపిల్లాడసలొద్దు" కొద్దిరోజులుగా భార్యెందుకు నిరుత్సాహంగా, నిర్లిప్తంగా ఉంటోందో అర్థమైనట్టనిపించింది విశ్వనాథానికి. మర్నాడంతా తీవ్రంగా ఆలోచించాడు. తల్లకాబోతున్న తన భార్య మానసికంగానూ, శారీరకంగానూ కూడా ఉత్సాహపూరితంగా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలి తప్ప నీరసంగా, నిరుత్సాహంగా ఉండకూడదు. ఆమె ఆరోగ్యంగా, సంతోషంగా తిరిగేందుకు తన ప్రయత్నం తను చెయ్యాలి. ఔను... చేస్తాడుతను.

* * *

"సునీతా... సునీతా" ఇంట్లోకి వస్తూనే చాలా హడావుడిగా కేకేశాడు విశ్వనాథం.

"ఏవిటండీ... వొస్తున్నా"

"చూడు సునీతా! ఆ కార్డిలా ఇవ్వు. అదే... ఆ రాజారావుకి వొచ్చిన ఉత్తరం, అతని అడ్రసు తెల్సిన వాళ్లొకళ్లు బజార్లో కలిశారు. ఈ ఉత్తరం అతనికందజేస్తా మన్నారు."

"నిజంగానా?" సునీత కళ్ళల్లో మెరుపు స్పష్టంగా చూడగలిగాడు విశ్వనాథం. సొరుగులా ఆ కార్డు అతని చేతికిచ్చింది. "అంతే కాదు సునీతా! ఆ రాజారావు, తల్లికి ఉత్తరాలు, పంపించిన మనియార్డరు చాలా ఆలస్యంగా, పోస్టల్ డిపార్టుమెంటు వాళ్ళ పొరపాటువల్ల మొన్ననే అందాయిట. బజార్లో కల్సిన ఆ పెద్ద మనిషి చెప్పాడు. ఆయనకి మరో స్నేహితుడు చెప్పాడట."

"అబ్బ! పోన్లెండి. చల్లనిమాట చెప్పారు. ఏదైనా కన్నతల్లి మీద ఆ మాత్రం ప్రేమ లేకుండా పోతుందా కొడుక్కి?"

భార్య మొహంలో కనిపించిన మార్పు చూసి ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు విశ్వనాథం. ఆమెలో ఆనాటికి సునీత కళ కనిపించిందిప్పుడు. ఈ చిన్న కార్డుముక్క తన ఇంట్లో తుపాను సృష్టించబోయింది కదా! అబద్ధం ఆడన పాపం తనకి చుట్టుకున్నా చుట్టుకుంది. తల్లికాబోతున్న సునీత మనసు అల్లకల్లోలం కాకుండా ఉంటే అంతే చాలు.